


# ఎంత చేసుకుంటే అంతే?

—: రచన: పి. నరసింగరావు :—

ఆనాడు బాగా చీకటి పడ్డతరువాత, రోజూ కంటే ఆలస్యంగా ప్రయివేటుకి వెళ్లా. రమణమూర్తి మాష్టారింటి గుమ్మంలో అడుగు పెట్టేనోలేదో "ఛీ....పో....ఈ జన్మలో మళ్లీ నీముఖం చూపెట్టకు. నాగుమ్మం తొక్కకు" అని పిడుగుల్లాంటి మాష్టారు మాటలు విని తృళ్లిపడ్డా. ఒక్కక్షణం నన్ను నేనే మరచిపోయా. భయంతో ఒణికిపోయా.

ఇంతలో 'రా వచ్చి కూర్చో'!అని రమణయ్య సంజ్ఞ చేయడంతో పిల్లిలా మెల్లిగా వెళ్లి కూర్చున్నా....

అప్పుడు అర్థమైంది. తిడుతున్నది నన్ను కాదని పాపారావునని. పాపారావు ముఖంలో కత్తివేస్తే నెత్తురుచుక్క లేదు. బెల్లం కొట్టిన రాయిలా అచేతనుడై రెండుచేతులూ కట్టుకుని నిల్చున్నాడు.

నా రాకవల్ల ఒకటి రెండు నిమిషాలు మౌనంగా దొర్లిపోయినా, మాష్టారు వస్తూన్న కోపాన్ని అణచుకోలేక, సంతత ధారగా కురిసిన వర్షం తరువాత విజృంభించి, అడ్డూ అపూ లేకుండా పొంగిపొరలుతూ, నానా భీభత్సం చేస్తున్న మహానదిలా, గాలికి యధేచ్ఛగా చెలరేగుతున్న కారుచిచ్చులా, మళ్లీ అందుకున్నారు.

"మిమ్మల్నందరినీ నా కన్నకొడుకులకంటే హెచ్చుగా చూసుకొంటున్నా. మీరందరూ బాగుపడాలనీ, అభివృద్ధిలోకి రావాలనీ అహోరాత్రులు కృషిచేస్తున్నా. గురువంటే తండ్రితో సమానం. అలాంటిది నా ఇంటికే చిచ్చుపెట్టి నాపేరు ప్రతిష్ఠలు నాశనం చెయ్యడానికి పూనుకొన్నావా? చాలు. చాలు. ఇక నడు" అన్నారు.

ఇంకా కదలకుండా, కాలి బొటనవ్రేలితో నేలరాస్తూ బిక్కముఖంతో నోట మాటరాక దిక్కులు చూస్తున్న పాపారావుని "ఏం? కదలవేం? నీకు కాదూ చెప్పేది?" అని గర్జించేసరికి చేసేదిలేక పాపారావు తన కొత్త రాలీసైకిలు తీసుకుని వెళ్లిపోయాడు.

ఆ తరువాత మావక్కకు తిరిగి "పదండి నాయినా ఇవాళ్టికి మీరూ దయచేయండి" అనేసరికి ఒకరిముఖాలు ఒకరం చూసుకుంటూ, పులినోట్లోనుండి బ్రతికి బయటపడ్డ మేకపిల్లల్లా మిగిలిన ముగ్గురం బయటపడ్డాం.

మాష్టారు దభాలున తలుపు వేసేసుకున్నారు. ఒకరితో ఒకరం మాట్లాడుకోకుండానే, భారంగా అడుగులు వేసుకుంటూ బరువెక్కిన హృదయాలతో పార్కుకువెళ్లి ఎవ్వరూలేని స్థలంలో ఒక రాతి చప్టాపై అందరం కూలబడ్డాం.

"ఇంతకూ ఏం జరిగింది?" అన్నా రాజుతో.

"ఏం జరిగిందా? చెప్పుకుంటే సిగ్గు సిగ్గు. మన పాపాలభైరవుడు ఉన్నాడుగా? ఉచ్చం, నీచంలేకుండా అసహ్యకరంగా ప్రవర్తించాడు. అది మాష్టారుకంట పడింది. ఆయన కాబట్టి సరిపోయింది. మరొకరైతే వాడి ప్రాణం తోడేసేవాళ్లే" అన్నాడు రాజు.

నాలో ఆతృత హెచ్చింది. 'అబ్బ, అసలు ఏం జరిగిందో చెప్పవయ్యా" అన్నా.

"ఏముంది. ఒంటరిగా ఉంది కదా అని పార్వతిని హటాత్తుగా కౌగలించుకున్నాడు. ఆ అమ్మాయి బిక్క చచ్చిపోయింది. ఆమె తేరుకుని విడిపించుకునేలోగానే అదృశ్యం అప్పుడే వీధిలోంచి వచ్చిన మాష్టారి కంట పడింది. పాపం, ఆ అమ్మాయి తనకేమీ తెలియదని, తాను నిర్దోషినని మొత్తుకుంటున్నా వినకుండా, కోపంలో మాష్టారు ఆమెను చావ గొట్టేరు. ఆ తరువాత మనవాడికి గడ్డిపెట్టేరు" అన్నాడు రమణయ్య.

"అయితే కునుకు నక్కమీద తాటిపండు పడ్డట్టయిందన్నమాట" అన్నా.

"నిజంగా ఆ అమ్మాయిని చూస్తే చెడ్డ జాలివేస్తుంది. భర్తపోయి ఇంకా సంవత్సరమైనా కాలేదా, ఏదో చదువులోపడి కొంత దుఃఖాన్ని మరచిపోగల్గుతూందంటే ఈనాడు ఈ దుస్సంఘటన జరిగింది. మాష్టారు అసలే పట్టుదల మనిషి. కోపిష్ఠి. ఈ సంఘటనవల్ల ఆమె జీవితమే తల్లకిందులు కావచ్చు" అన్నాడు రాజు జాలిగా.

మా అందరికీ పార్వతిమీద ఎక్కడలేని జాలి, సానుభూతీ కల్గేయి. ఆనాడు ఆమెకు కల్గిన దుర్గతికి ఎంతగానో బాధపడ్డాం.... పాపారావును నమిలి మింగేద్దామా అన్నంత కోపంతో ఎవరినోటికి వచ్చినట్లు వాళ్లం తిట్టేం. శపించాం. కాని మా తిట్లూ, శాపాలూ, గాలిలో కలిసి ఎక్కడికో ఎగిరిపోయాయి.

రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో ఎవరి ఇల్లు వాళ్లు చేరుకున్నాం.

* * *

ఆనాటి సంఘటన అంతగా బయిటకు పొక్కకపోయినా పాపారావుమాత్రం స్కూలు మానుకున్నాడు. మానేస్తేనేం? లక్షాధికారికి ఒక్కగాని ఒక్కకొడుకు. దానికితోడు వాళ్లకు ఒక సినిమా థియేటరుకూడా ఉంది. అసలు అతని తల్లిదండ్రులు మొదటినుంచీ భయభక్తులన్నవి చెప్పకుండా ఆడింది ఆటగా పాడింది పాటగా అతి గారాబంతో. మరీ ముద్దు చెయ్యబట్టే మొద్దుగా అల్లరిచిల్లరిగా తయారయ్యాడు. ఇంచుమించు క్లాసుకో సంవత్సరం చొప్పున కూర్చుంటూ ఎలాగయితేనేం, ఇరవైరెండు సంవత్సరాలకు స్కూలు ఫైనలుకు చేరుకున్నాడు. పాపారావుకు ఎన్నో దురలవాట్లూ, విపరీతమైన శరీరోద్రేకాలూ అందులో ముఖ్యంగా స్త్రీలోలత్వం ఉన్నా కొన్నికొన్ని మంచిగుణాలుకూడా లేకపోలేదు. స్నేహితులంటే ప్రాణం పెట్టేవాడు. పేద వాళ్లకు తన శాయశక్తులా సాయం చేసేవాడు

స్కూలు వదలిపెట్టేరు. వడివడిగా నడిచి ఇంటికి పోతున్నా.

'ఏయ్ మూర్తి ఆగు' అని పాపారావు ఒక్క కేకవేసి, మరో రెండునిముషాల్లోనే సైకిలుమీద వచ్చి కలిశాడు.

నేను ముఖం చిట్లించుకున్నా.

"ఇప్పుడు మీ అందరికీ నేనో చీడ పురుగులా కనపడుతున్నా కదూ?" అన్నాడు నా ముఖంలోకి ఆతృతగా చూస్తూ.

"ఎలా కనపడితేనేం?" అన్నా అతనితో మాట్లాడ్డం ఇష్టంలేనట్లు ముఖం పెట్టి.

"మూర్తీ ఒక్కవిషయం మాత్రం మీతో చెప్పుకుంటే నామనస్సు కొంత కుదుటపడుతుంది. నేను మంచివాడినని ఎప్పుడూ అనను. వయస్సుకు మించినవి, కూడనివీ, ఎన్నో దురలవాట్లూ నాకున్నాయి. హద్దులు మీరిన కోరికలతో ఏనాడో నాజీవితం కలుషితమైంది. ఆనాడు క్షుద్రమైన కామోద్రేకానికి లోనై, అంధకారంలో కన్నూ మిన్నూ కానక అమాయకురాలైన పార్వతిని నాకు తెలియకుండానే కౌగలించుకున్నా. మాష్టారుకి ద్రోహం చేశా. ఆమెకు తీరని అన్యాయం చేశా. అప్రతిష్ఠ తెచ్చా" అన్నాడు.

"నిజమే కావచ్చు. కాని, నీమాటలు నమ్మే దెవరు? ఇంతకూ చేతులు కాలేక చేసేదేముంది?" అన్నా.

"అందుకే మాష్టారుకి ముఖం చూపలేక స్కూలు మానుకున్నా" అన్నాడు.

పాపారావు చేసినతప్పును ఒప్పుకుని అంతగా బాధపడుతున్నందుకు అతనిమీద కొంత సానుభూతి కల్గింది.

"అయితే ఇకనైనా ఇలాంటిపనులు మానుకుంటావా?" అన్నా.

"ఏమో? అంత నిగ్రహశక్తే నాకుంటే ఈ అనర్థాలన్నీ ఎందుకు వస్తాయి? నా జీవితమే ఒక తెగిపోయిన గాలిపటం. చుక్కాని లేని నావ. ఏ క్షణానికి ఏం చేస్తానో? ఏం జరుగుతుందో నాకే తెలియదు" అన్నాడు.

'సరే మళ్లీ కలుద్దాం' అని అతన్ని వీడి తించుకుని ఇల్లు చేరుకున్నా.

ఆసమయానికి మా అమ్మతో మాట్లాడుతున్న మాష్టారి ధర్మపత్ని నన్ను చూడగానే "అయ్యో అప్పుడే స్కూలు విడిచిపెట్టేశారు. వస్తానమ్మా. మరి అన్నగారిచేత ఆయనకు చెప్పించి పుణ్యం కట్టుకుంటారు కదూ?" అంది.

"ఆ...బహుశా వారు రేంపునుండి ఈ సాయంత్రమే వస్తారు. రాగానే పిలిపించి గట్టిగా చెప్పిస్తా. మరేం భయపడకండి" అంది మా అమ్మ ఆమె నొసట బొట్టుపెడుతూ.

*　　*　　*

ఆరాత్రి ఎనిమిదిన్నర గంటలప్రాంతంలో మాష్టారు మా ఇంటికి వచ్చారు. మా నాన్నగారూ, ఆయనా పడకకుర్చీలలో కూర్చొని తాంబూలం సేవిస్తూ ఇష్టాగోష్టిలో మునిగిపోయారు. అక్కడకు దగ్గరలోనే చాపమీద పుస్తకాలు తెరచి కూర్చుని చదువుతున్నా నన్నమాటేగాని నాదృష్టి అంతా వాళ్ల సంభాషణమీదే ఉంది.

మా నాన్నగారికి, మాష్టారితో పరిచయమై ఒక సంవత్సరమే అయినా, ఒకరంటే ఒకరికి మంచి అభిప్రాయం, గౌరవం, స్నేహం ఏర్పడ్డాయి. దానికితోడు తీరికసమయాలలో ఇద్దరూ కలిసి తరచు కాలక్షేపం చెయ్యడం నుంచీ, అరమరికలు లేకుండా ఒకరి సంసారం గొడవలు మరొకరితో మనస్సు విప్పి మాట్లాడుకోవడంనుంచీ బాగా చనువు ఏర్పడింది.

కొంతసేపైన తరువాత మానాన్నగారు "మీ వాళ్లు పెళ్లినుండి వచ్చేశారుట కదూ?" అన్నారు.

"ఔనండీ, నిన్ననే వచ్చారు. పెళ్లి సవ్యంగానే జరిగిపోయిందట."

"అన్నట్టు మీ పార్వతికి ఏదో సంబంధం చూశారుట?"

"ఆ కుదిరిందండీ. వరుడు రెండో పెళ్లివాడూ, కాస్త వయస్సు ముదిరినవాడూ అన్న మాట తప్ప యోగ్యుడు. బాగా డబ్బున్నవాడు. ఇంతకూ మూడుమాసాలు కాపురం చేసి భర్తను పోగొట్టుకున్న నిర్భాగ్యురాలికి అంతకన్నా మంచి సంబంధం కావాలంటే మాత్రం ఎలా వస్తుంది చెప్పండి?

"అదేమిటి తగినంతగా చదివిస్తే ఆమె బ్రతుకు ఆమె బ్రతుకుతుందని ఇదివరలో అన్నారుకదా? మళ్లీ ఇంతలోనే పెళ్లితొందరేమొచ్చింది?" అన్నారు మానాన్నగారు.

"బహుశా మీరూ వినే ఉంటారు. మొన్న పాపారావు అన్న కుర్రవాడు అసహ్యపు పని చేశాడు! ఈవిషయం నలుగురికీ తెలిస్తే ఎంత అప్రతిష్ఠ! ఎంత అపఖ్యాతి?"

"విన్నాననుకోండి. అయినా ఆ దరిద్రుడు ఏదో అపవాద్యంగా ప్రవర్తించాడని అమ్మాయిని అనుమానించడం అంత భావ్యం కాదు. నిస్సందేహంగా అమ్మాయి బుద్ధిమంతురాలు."

"మా అమ్మాయిమీద నమ్మకం లేకకాదు. కాని వయస్సూ సౌందర్యం ఉన్నాయి చూశారు ఎవరినైనా ఆకర్షించి రెచ్చగొట్టవచ్చు. అందులో మొగుడూ మొద్దులూ లేని అనాథ స్త్రీ అయితే ఈలోకంలో మరీ అనువు. తప్పని సరిగానైనా ఆ అకర్షణలోపడి ఏనాడైనా తప్పుతోవ తొక్కవచ్చు. అపఖ్యాతి తేవచ్చు. అంచేత వివాహం చేసెయ్యడమే ఉత్తమమైన దనే నిర్ణయానికి వచ్చా."

"చూడండి ఏ కట్టెలో నిప్పుంటే ఆకట్టే కాలుతుంది. అమ్మాయి మనస్సు తెలిసికూడా ఎప్పుడో ఏదో జరుగుతుందనే అపోహతో తొందరపడి నలభై ఏళ్ల వరునికి, అందులో ముగ్గురుపిల్లల తండ్రికి, తల చెడినదైతేనేం, పదిహేడేళ్ల అమ్మాయిని ఇచ్చి మళ్లీ పెళ్లి చెయ్యడం ఆమె జీవితంలో నిప్పులు పొయ్యడమే, తెలిసితెలిసీ ఆమెకు రెండోసారి వైధవ్యం కొనితేవడమే" అన్నారు మా నాన్నగారు తీక్షణంగా.

"ముందు గొయ్యి-వెనుక నుయ్యి అన్నట్లయింది నా పని. నిక్షేపంలాంటి కుర్రాణ్ణి చూసి పెళ్లిచేశా. కాని ఏం లాభం దురదృష్ట దేవత, వాళ్ల ఈడూ జోడూ, అంద చందాలూ, అన్యోన్యత చూసి ఓర్వలేక, దాని సౌభాగ్యాన్ని కూకటివేళ్లతో పెకలించివేసింది. అంతే ఎండిన మోడులా, వాడిన కుసుమంలా, జీవచ్ఛవంలా దానిజీవితం వ్యర్థంగా గడచిపోవలసిందే" అన్నారు మాష్టారు బాధగా.

"చూడండి అవన్ని అనుకుని దుఃఖపడితే మాత్రం ఏం ప్రయోజనం? అమ్మాయి పెళ్లంటే అసలే విముఖంగా ఉంది. పైగా బుద్ధిమంతురాలూ, చదువుమీద శ్రద్ధ ఉంది. కష్టపడి ఎలాగో ఒకలాగు బాగా చదివించారా తప్పక అభివృద్ధిలోకి వస్తుంది. మగపిల్లలు ఇద్దరూ ఎలాగూ చిన్నవాళ్లు కాబట్టి ఆమె ఏదైనా మంచి ఉద్యోగం చేసిందా, మీరు రిటైర్ అయినా బాధలేదు. అన్నివిధాలా సహాయపడగలదు. ఆమెకూ కొంత తృప్తి శాంతీ లభిస్తాయి. జీవితం సార్థకమౌతుంది. ఒకవేళ మీరూహించినట్లే ఎవరి ప్రోద్బలం వల్లనో పాడైందనుకోండి. అప్పుడు ఆమె ఖర్మకు ఆమెనే ఒదిలివచ్చు" అన్నారు.

ఇలా కొంతసేపు వాగ్యుద్ధం జరిగిన తరువాత అతి కష్టంమీద, వివాహప్రసక్తి వదలివేసి, పార్వతిని చదివించడానికే మాష్టారు అంగీకరించారు.

* * *

ఆసంవత్సరం స్కూలుఫైనలు ప్యాసయ్యానంటే మాష్టారి చలువే. పార్వతికూడా మెట్రిక్ ప్యాసైంది. కాని అంతలోనే మా నాన్నగారికి బళ్లారినుండి కాకినాడ ట్రాన్స్ఫరు కాగా సకుటుంబంగా వచ్చివేశాం. కొత్తలో నాలుగైదు నెలలు, నాకూ నా స్నేహితులకూ మా నాన్నగారికి మాష్టారుకి ఉత్సాహంగా ఉత్తరప్రత్యుత్తరాలు నడచినా ఏకారణం లేకుండానే ఆ తరువాత నిలచిపోయాయి. ఆ తరువాత ఒకరివిషయాలు ఒకరికి తెలియ లేదు.

కాలగర్భంలో ఎనిమిదిసంవత్సరాలు దొర్లిపోయాయి. భగవంతుని దయవలన అట్టే కష్టం లేకుండానే బి. కాం. ప్యాసై బేంకిలో రెండువందలు ఇచ్చే ఉద్యోగం చేస్తు శ్రీకాకుళంలో స్థిరపడ్డాం.

నాకు తగినది అన్నివిధాలా అనుకూలమైనదీ లక్ష్మి నా జీవిత సహధర్మచారిణి ఐంది.

మా నాన్నగారు రిటైర్ అయినా, ఏ కొరతా లేకుండా, దేనికీ ఇబ్బంది పడకుండా, ఆనందంగానే రోజులు వెళ్లిపోతున్నాయి.

లక్ష్మికి నెలలు నిండేయి. మొదటికాన్పే అయినా, ఏవో అనివార్యకారణాలవల్ల పురుడు మా ఇంట్లోనే పోయవలసి వచ్చింది.

ఆనాడు మానాన్నగారు ఏవో లావాదేవీల విషయంలో తప్పనిసరిగా పారుగూరు వెళ్లేరు.

రాత్రి పన్నెండుగంటలై ఉంటుంది. మా అమ్మా అత్తగారూ, హడావిడిగా నన్ను లేపి "నాయనా నొప్పులు ఆరంభమయ్యాయి. త్వరగా కొత్త లేడీడాక్టరుని పిలుచుకురా" అని తొందరపెట్టేరు.

మంత్రసానికోసం పని కుర్రాణ్ణి లేపిపంపి, నేను బట్టలు మార్చుకుని, సైకిలు తీసుకుని బయలుదేరా.

కొత్త లేడీడాక్టరు వచ్చి ఇంకా వారంరోజులైనా కాలేదు. ఏమీ పరిచయం లేదు ఎలాంటి మనిషో ఏమో? వస్తుందో? రాదో? అనుభవం బాగా ఉన్నదో లేదో? అని ఇలా రకరకాలుగా ఆలోచిస్తూ ఆమె ఇల్లు చేరా.

ఎస్. కమల ఎం.బి. బి.యస్. అన్న బోర్డు చూసి ఇల్లు అదేనని నిర్ధారణ చేసుకుని తలుపు తట్టేను.

లైటు వెలిగింది.


తలుపు తెరువబడింది.

నాకళ్లను నేనే నమ్మలేకపోయాను.

రమణమూర్తి మాష్టారు !!!

ఆయనమాత్రం నన్ను వెంటనే గుర్తుపట్టలేక "ఎవరు నాయనా ఎందుకు వచ్చారు?" అని సాదరంగా అడిగేరు.

ఇంటిపేరుతోసహా 'ఫలానావారి అబ్బాయిని' అని చెప్పేసరికి ఆయన ఆనందానికి అవధులేకపోయాయి.



"అబ్బ ఎన్నాళ్లకు చూశానోయ్! మీ నాన్నగారూ వాళ్ళూ క్షేమమేకదా?" అన్నారు.

నేను సమాధానం చెప్తూ ఉండగానే డాక్టరుగారు వచ్చారు.

"పార్వతిని గుర్తుపట్టేవా? కమల ఎవరు అనుకుంటున్నావు? పార్వతే! మంచిదనీ, పేరు మార్చుకోమనీ ఎవరో సలహా ఇస్తే మార్చుకుంది" అన్నారు.

ఆశ్చర్యపోయా. మాట్లాడుకుంటూనే మాష్టారూ కమలా రిక్షాలోనూ, నేను సైకిలు మీద అనతికాలంలోనే మా ఇల్లు చేరుకున్నాం.

లక్ష్మికి సవ్యంగా పురుడైంది. మగపిల్లడు.

ఆ మర్నాడు మాష్టారు సకుటుంబంగా వచ్చేరు. అనరికి మా నాన్నగారుకూడా తిరిగి వచ్చేరు. పార్వతిని చదివించినందుకు అభివృద్ధిలోకివచ్చి కుటుంబానికి సహాయపడుతున్నందుకు మా ఇంట్లో అందరూ ఆమెను కొనియాడేరు.

ఆసాయింత్రం వాళ్లందరూ వెళ్లిపోయిన తరువాత అప్పుడే వచ్చిన దినపత్రిక చదువుతూ, అందులో పాపారావు దారుణంగా హత్యచేయబడ్డాడని ఫోటోతోసహా సంతాపసూచకంగా ప్రకటింపబడిన విషయం చదివి నీరైపోయా. అతను చెడ్డవాడే. ఎందరో యువతులను చెరచి వాళ్ల జీవితాలను నాశనం చేశాడు. అయినా అతని అకాలమరణానికి బాధపడకుండా ఉండలేకపోయా.

ఆతృతగా "అమ్మా! పాపారావు అనే ఒక కుర్రాడు నేను స్కూలుఫైనలు చదువుకునే రోజుల్లో మన ఇంటికి వచ్చేవాడే గుర్తుందా? అతన్ని ఎవరో దారుణంగా హత్య చేశారుట. ఇద్దరు పిల్లలుకూడా ఉన్నారుట" అన్నా బాధగా.

"అయ్యో పాపం! ఎవరు? ఆ సినీమా ప్రొప్రయిటరు కొడుకే కదూ?" అంది.

"ఎంత అన్నుంటేనేం? తల్లిదండ్రులకూ, భార్యాపిల్లలకూ తీరని సంతాపం కలిగించి, ముప్ఫయిఏళ్ళయినా నిండకుండా అర్ధాన్నపు చావు చచ్చేడు. ఇంతకూ 'ఎంత చేసుకుంటే అంతే' అంతకన్నా హెచ్చు రమ్మంటే ఎలా వస్తుంది?" అన్నారు మా నాన్నగారు రిటైర్ అయి తను ఒంట పట్టించుకున్న వేదాంతాన్ని ఒలకబోస్తూ. ★